క్లుప్తంగా

వరద బాధితులకు విరాళం



మక్కపేట(వత్సవాయి): వరద బాధితుల సహాయార్థం గ్రామంలోని శ్రీ సాయి సెంచరీ విద్యార్థులు ప్రజల నుంచి రూ.25,000 విరాళాలను సేకరించారు. ఈ మొత్తానికి విలువైన చెక్కును మంగళవారం అప్కా రాష్ట్ర చైర్మన్ గొల్లపూడి మోహన్‌రావుకు పాఠశాల కరస్పాండెంట్ కేఆర్ భరద్వాజ్, ప్రిన్సిపాల్ కె.సవితలు అందజేశారు. వీటిని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేయాల్సిందిగా కోరారు. విపత్తుల సమయంలో తోటి వారికి సాయం అందించాలనే సంకల్పం గొప్పదన్నారు. కార్యక్రమంలో షేక్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

24న మండల క్రీడా పోటీలు

పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఈనెల 24న మండల క్రీడా పోటీలు, క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని ఎంఈవో డి.రవీంద్ర, మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి వి.వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగ, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈక్రీడల్లో జెడ్పీ హైస్కూల్స్, ఎయిడెడ్ హైస్కూల్, రికగ్నైజ్డ్ స్కూల్, యూపీ స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులు పోటీలకు అర్హులన్నారు. జనవరి 2011 తరువాత జన్మించిన వారు అండర్–14, జనవరి 1, 2008 తరువాత జన్మించిన వారు అండర్–17 విభాగాల్లో పోటీకి అర్హులు. పాఠశాల హెచ్‌ఎంలు అందరూ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారుల జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు హాజరయ్యేలా చూడాలని కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నందిగామ టౌన్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. చందర్లపాడు నుంచి ఓ ఆటోలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నందిగామ పట్టణ సమీపంలోని చందాపురం ఫ్లైఓవర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వాహనాలను తనిఖీ చేసి బియ్యం లోడుతో వస్తున్న ట్రక్కును గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చందర్లపాడుకు చెందిన మాదిరాజు నరసింహారావుకు చెందినవిగా తెలిపినట్లు సమాచారం. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు సరఫరా చేసే వ్యక్తి మృతి

కంచికచర్ల: ఇంటింటికి తాగునీరు సరఫరా చేసే ఓ వ్యక్తి హఠాత్తుగా మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మండలంలోని మున్నలూరుకు చెందిన డీ రామకృష్ణ (34) మినరల్ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తుంటాడు. అయితే మోగులూరు గ్రామంలో ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేసే సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు కంచికచర్ల ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పోలీసులు నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డుపై కెమికల్ వ్యర్థాలు

గ్రామస్తుల ఆందోళన



ముత్యాల (జగ్గయ్యపేట): మండలంలోని ముత్యాల గ్రామంలో కెమికల్ వ్యర్థాలు బహిరంగంగా వదులుతున్నారంటూ మంగళవారం రాత్రి గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామాల్లోని పందుల ఫామ్ వద్ద లారీలు కెమికల్ వ్యర్థాలతో వెళ్తుండగా ఒక లారీ నిలిచిపోవడంతో అందులోని కెమికల్స్ వ్యర్థాలు రోడ్డుపై పడ్డాయి. దీంతో ఆ ప్రాంతం దుర్వాసన రావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా లారీని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న చిల్లకల్లు ఎస్‌ఐ.సూర్య శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను విచారిస్తున్నారు.

నగదు బహుమతులు అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్థానిక జెడ్పీ పాఠశాల బాలికలు చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా పెట్ల పార్వతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు మంగళవారం అందజేశారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 17 మంది బాలికలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులను ట్రస్ట్ గౌరవ అధ్యక్షురాలు దేవినేని జోనీకుమారి, డాక్టర్ మామిడి సీతారామారావు అందజేశారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం బి.పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు అవసరం

- మునేరు వరదకు అమ్మవారి తోటల్లోకి భారీగా నీరు
- అమ్మవారి మామిడి తోటల పక్కనే వాగు, తువ్వ కాలువ
- భవిష్యత్తులో ముంపు సమస్య రాకుండా పరిష్కరించాలంటున్న భక్తులు



షెడ్ల చుట్టూ వరద నీరు (ఫైల్)

పెనుగంచిప్రోలు: ఇటీవల మునేరుకు భారీగా వరద రావటంతో మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లోకి కూడా వరద నీరు చేరింది. భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా రక్షణ చర్యలు అవసరమని వరద హెచ్చరించినట్టుగా కనిపిస్తోంది.

రూ.కోట్లతో భవనాల నిర్మాణం..

ఆలయ అభివృద్ధి చర్యల్లో భాగంగా మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో రూ.3.75 కోట్లతో కల్యాణ మండపం, రెండు మినీ ఫంక్షన్ హాల్స్, ఏసీ గదులు, టాయిలెట్ బ్లాక్, రూ.1.85 కోట్లతో నాలుగు షెడ్లు, టాయిలెట్ బ్లాక్, గదుల నిర్మాణం పూర్తి చేశారు. కొద్ది రోజుల్లో వినియోగంలోకి రానున్నాయి.

సమస్య ఇదీ..

ఇటీవలన వచ్చిన వరదకు షెడ్లు చుట్టూ వరద నీరు వచ్చి చేరింది. పెనుగంచిప్రోలు నుంచి వెళ్తుంటే రోడ్డుకు ఎడమ పక్క ఉన్న తోటలో మునేరు వరదతో పాటు, వాగు పోటెత్తటంతో తోట మొత్తం వరద నీరు చేరింది. షెడ్లలో కూడా వరద నీరు పారింది. అలాగే కుడి పక్కన ఉన్న తోటలో తువ్వకాలువకు గండ్లు పడటంతో ఆనీటితో పాటు మునేరు వరద పోటెత్తింది. దీంతో



మామిడి తోటలో వరద నీరు (ఫైల్)



అమ్మవారితోటలో కల్యాణ మండపం నిర్మాణం పక్కన ఏర్పడిన తువ్వకాలువ గండి

కల్యాణ మండపం సగం వరకు మునేరు వరద వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో భక్తుల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

రక్షణ చర్యలు చేపట్టాలి..

భవిష్యత్తులో వరదలు వచ్చినా అవి ఉపయోగంలో ఉండాలంటే చుట్టూ రక్షణ గోడ అవసరం అని భక్తులు అంటున్నారు. కోట్ల రూపాలయ నిధులతో నిర్మించిన భవనాలు, భక్తుల భద్రత కల్పించాలంటే తగిన రక్షణ చర్యలు కల్పించాల్సిన అవసరం ఉంది. వరద స్థాయిని దృష్టిలో ఉంచుకుని ఇబ్బందులులేని విధంగా రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నిర్ణయం తీసుకుంటాం..

దీనిపై ఆలయ ఇంజినీరింగ్ అధికారులను వివరణ కోరగా కల్యాణ మండపం నిర్మించిన తోటలో మూడు గండ్లు ఆలయ స్థలం వైపు పడ్డాయన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పటిష్ట రక్షణ చర్యలు అవసరమని, దీనిపై త్వరలో అధికారులుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రజలందరికీ ఇళ్లు అందించడమే కర్తవ్యం

జగ్గయ్యపేట అర్బన్: ప్రజలందరికీ ఇళ్లు అందించడమే ప్రథమ కర్తవ్యం అని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. ప్రధాన మంత్రి అవాజ్ యోజన అర్బన్ 2.0 కార్యక్రమం ప్రారంభోత్సవం ప్రత్యక్ష ప్రసారాన్ని మంగళవారం స్థానిక ఉక్కు కళావేదికలో ఏర్పాటు చేయగా, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కౌన్సిలర్లు పి.పుల్లారావు, నకిరికంటి వెంకట్, ఇర్రి నరసింహారావు, జి.వెంకట్రావు, నాయకులు మైనేని రాధ, కర్ల జోజి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

వత్సవాయి: పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం పోషకాహార మాసోత్సవాలలో భాగంగా మక్కపేట, చిట్టేల, భీమవరం, మంగొల్లు, గోపినేనిపాలెం, పెద్దమోదుగపల్లి గ్రామాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నివాసప్రాంతాలలో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవడం, ఇంటిముందున్న సైడ్ కాలువలను శుభ్రం చేసుకోవడం, తాగివదేసిన ఖాళీ కొబ్బరిబోండాలను దూరంగా పడవేయడంతోపాటు పరిశుభ్రమైన నీటిని తాగడం వంటివి చేయాలన్నారు. భోజనానికి ముందు చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.



చిట్టేలలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

సులభరీతిలో పాఠాలు బోధించాలి

గౌరవరం(జగ్గయ్యపేట): విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో పాఠ్యాంశాలు బోధించాలని ఎంఈవో చిట్టిబాబు ఉపాధ్యాయులకు సూచించారు. గౌరవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరగనున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్‌కు సంబంధించిన బోధనలు ప్రతి వారం రికార్డుల్లో పొందుపరచాలని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యాంశాల బోధనలను టీచ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, టీచబుల్ ట్రైనర్స్ సయ్యద్ రఫీ, సుబ్బారావు, ప్రసాద్, కొండయ్యచారి, సీఆర్పీ భావన, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో చిట్టిబాబు

•జై బోలో గణేష్ మహారాజ్‌కీ

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో వినాయకచవితి సందర్భంగా గణనాథుడి విగ్రహాలకు పూజలు, నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పూజల అనంతరం విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై భక్తులు తరలిస్తూ ఉల్లాసంగా ఉత్సాహంగా సమీపంలోని నదుల్లో నిమజ్జనం చేస్తున్నారు.

–జగ్గయ్యపేట అర్బన్/పెనుగంచిప్రోలు/కంచికచర్ల



పేటలో చెరువు బజారులో భారీ గణనాథునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



పేటలోని డాంగేనగర్ మండపంలో గణనాథునికి పూజలు



పేటలో కోదాడ రోడ్‌లో మండపం వద్ద విద్యార్థుల నృత్య ప్రదర్శన



కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో గణేషుడుకి భక్తుల పూజలు



పెనుగంచిప్రోలులో గణనాథుని విగ్రహాల ఊరేగింపు



పేటలో చెరువు బజారు మండపం వద్ద నృత్యాలు చేసిన చిన్నారులు



కంచికచర్ల మండలం కీసర మున్నేరులో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

ఘనంగా విశ్వకర్మ జయంతి



పెనుగంచిప్రోలు శ్రీవిరాట్ విశ్వకర్మ చిత్రపటం వద్ద పూజల్లో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు



మక్కపేటలో విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు



తొర్రకుంటపాలెంలో విశ్వఖర్మ యజ్ఞం



బ్రహ్మంగారి ఆలయంలో గాయత్రి, విశ్వకర్మల కల్యాణోత్సవం

పెనుగంచిప్రోలు: మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలులో మంగళవారం శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వాస్తు సిద్ధాంతి చల్లాల శివాజీ మాట్లాడుతూ సృష్టిలో విశ్వకర్మ ద్వారానే వృత్తులు ఏర్పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి డీవీఎస్ చారి, జిల్లా కోశాధికారి పి.సాంబశివరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు నాయకులు నంచర్ల గోపాలరావు, తునికిపాటి శివ, మండల యువజన నాయకులు టి.రామకృష్ణ, మండల నాయకులు వెలిశాల ఏడుకొండలు, తునికిపాటి రాంబాబు, పులికొండ పిచ్చయ్యాచారి, కల్లూరి కేశవాచారి, నాగబ్రహ్మాచారి, పుల్లయ్యాచారి, రామాచారి, ఎస్.రమణ, తదితరులు పాల్గొన్నారు. ముండ్లపాడు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, లింగగూడెంలో సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు.

మక్కపేట(వత్సవాయి): మండలంలోని మక్కపేటలో విశ్వకర్మ జయంతిని మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సంఘ ఆధ్వర్యంలో నూతన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ మండల అధ్యక్షుడు కొమరగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వానికి ఆదిగురువు విశ్వకర్మ అని తెలిపారు. ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా పథకాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, అప్పలాచారి, బ్రహ్మం, వీరబ్రహ్మాచారి, రవి, శ్రీహరి, వేణు, చిప్పాడ శ్రీను, రవి, నరసింహాచారి, బ్రహ్మాచారి, రామకృష్ణ పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: పట్టణంలోని గోవిందాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఈశ్వరీ దేవి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సోమోజు సాయిచార్యులు ఆధ్వర్యంలో గాయత్రి విశ్వకర్మల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.లోకకల్యాణార్థం స్వామి, అమ్మవారి కల్యాణం జరిపించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. పూజామహోత్స విశిష్టతను వివరించారు. ఈ కల్యాణోత్సవంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. తొర్రకుంటపాలెంలో పది మంది దంపతులు విశ్వకర్మ యజ్ఞం చేసి జెండాను ఆవిష్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం
- పరిసరాల పరిశుభ్రతపై అవగాహన
- ర్యాలీలు, మానవహారాలు
- ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, విద్యార్థులు




కంచికచర్లలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఎంపీడీఓ శిల్ప, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

కంచికచర్ల: పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు చూడాలని ఎంపీడీఓ కానూరు శిల్ప అన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి గ్రామ వీధుల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ఎంపీడీఓ మాట్లాడుతూ, ఇటీవల కుండపోతగా వర్షాలు కురిసాయని ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచి బొక్కా రవికుమార్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, హెచ్‌ఎం రామకృష్ణ, అంగనవాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

జయంతి(వీరులపాడు): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని సర్పంచ్ మారపాక మహాలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని జయంతి, పల్లెంపల్లి గ్రామాలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తాచెదారాలను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వేయకుండా విధిగా చెత్త కుండీలను వినియోగించాలన్నారు. స్వచ్ఛత పాటించటం వల్ల అనారోగ్యం నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండి ఇళ్ల వద్ద తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారికి స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన సెంటరులో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, సొసైటీ చైర్మన్ జంగా కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గండేపల్లి సీఎస్‌ఐ సెంటర్‌లో మానవహారం



కొణతాలపల్లిలో అవగాహన ర్యాలీలో విద్యార్థులు, సిబ్బంది

సారా తయారీదారుల అరెస్ట్



తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్‌లోని పలు గ్రామాల్లో అధికారులు దాడులు నిర్వహించారు. గంపలగూడెం మండలం పెదకొమెర, అమ్మిరెడ్డిగూడెం గ్రామాల్లో సారా బట్టీల్లో 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పెదకొమెరలో గుంజి అశోక్, గుంజి గోపీల నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. నిందితులను గంపలగూడెం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

అల్తాఫ్ రజాకు పెన్షనర్ల సన్మానం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వరద బాధితులను అన్నదానంతో ఆదుకున్న షాబూఖారీ దర్గా ఆస్థాన పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్‌రజాను రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సత్కరించారు. బాధితులకు మూడు పూటలా ఆహార పదార్థాలు అందజేయడం అభినందనీయమని వారు కొనియాడారు. అసోసియేషన్ చైర్మన్ వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా, సభ్యులు శ్యాంబాబు, హనుమంతరావు, చిన్నమస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



అల్తాఫ్ రజాను సన్మానిస్తున్న రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

బ్రిడ్జి పునరుద్ధరణ ఎప్పుడో..?



పాలేటి వరదకు కొట్టుకుపోయిన బలుసుపాడు-అన్నవరం బ్రిడ్జి

20 రోజులుగా నిలిచిన రాకపోకలు

జగ్గయ్యపేట: మండలంలోని బలుసుపాడు-అన్నవరం వెళ్లే పాలేటిపై ఉన్న బ్రిడ్జి ఇటీవల వరదలకు ధ్వంసమవటంతో 20 రోజులుగా రాకపోకలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉధృతికి అర కి.మీ మేర అప్రోచ్ రోడ్డుతో పాటు వంతెన కూడా కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు లేకపోవడంతో తెలంగాణ నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. జగ్గయ్యపేటకు వెళ్లాలంటే తెలంగాణలో నుంచి 30 కి.మీ ప్రయాణించాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రోడ్డును పునరుద్ధరించి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.